రోజుకు 5.9 కోట్ల విరాళం

2023-24లో రూ.2,153 కోట్లు విరాళ మిచ్చిన శివ్ నాడర్

ముంబై, నవంబర్ 7: దేశీయ కుబేరుల్లో ఒకరైన హెచ్‌సీఎల్ టెక్నాలజీ చైర్మన్ శివ్ నాడర్ దాతృత్వంలో మరోసారి సత్తాచాటారు. రోజుకు రూ.5.9 కోట్ల చొప్పున 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.2,153 కోట్లు విరాళ రూపంలో చెల్లింపులు జరిపారు. ఎడల్‌గివ్-హురున్ ఇండియా ఫిలంత్రోపీ విడుదల చేసిన దేశీయ జాబితా ద్వారా ఈ విషయం వెల్లడైంది. అంతక్రితం ఏడాది ఇచ్చిన విరాళం కంటే ఇది ఐదు శాతం అధికమని పేర్కొంది. అలాగే ఇతర దేశీయ శ్రీమంతులుగా వెలుగొందుతున్న గౌతమ్ అదానీ, ముకేశ్ అంబానీలు శివ్ నాడర్ కంటే చాలా దూరంలో నిలిచారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో గౌతమ్ అదానీ కేవలం రూ.330 కోట్లు విరాళం ఇవ్వగా, ముకేశ్ అంబానీ రూ.407 కోట్లతో సరిపెట్టుకున్నారు. ఈ జాబితాలో ముకేశ్ అంబానీ తన ర్యాంక్‌ను మెరుగుపరుచుకొని రెండో స్థానానికి చేరుకోగా, అదానీ తన ఐదో స్థానంలోనే కొనసాగారు. బజాజ్ కుటుంబం ర్యాంక్ మూడు స్థానాలు ఎగబాకి మూడో స్థానానికి చేరుకోగా, కుమారమంగళం బిర్లా అండ్ ఫ్యామ్లీ నాలుగో స్థానంలో నిలిచారు.



- ఈ జాబితాలో వ్యక్తిగతంగా రూ.5 కోట్ల కంటే అధికంగా విరాళం ఇచ్చిన వారి సంఖ్య 203
- రూ.1,000 కోట్ల కంటే అధిక నికర విలువ కలిగిన వారు 1,539 మంది ఉండగా, వీరి సంపద 46 శాతం చొప్పున పెరిగింది.
- సరాసరిగా విరాళం ఇచ్చే వారి సంఖ్య 119 నుంచి 203కి పెరిగినప్పటికీ వీరి విరాళం మాత్రం రూ.71 కోట్ల నుంచి రూ.43 కోట్లకు తగ్గింది.
- దేశీయ శ్రీమంతుల జాబితాలో రూ.3.14 లక్షల కోట్ల సంపదతో నాడర్ మూడో స్థానంలో ఉండగా, అదానీ రూ.11.6 లక్షల కోట్లతో తొలిస్థానంలో, రూ.10.14 లక్షల కోట్లతో అంబానీ ఆ తర్వాతి స్థానంలో ఉన్నారు.
- విప్రో చీఫ్ అజీం ప్రేమ్‌జీ విరాళం రూ.1,774 కోట్ల నుంచి రూ.152 కోట్లకు తగ్గాయి.
- అత్యధికంగా విరాళం అందుకున్న రంగాల్లో విద్యారంగంలోకి రూ.3,680 కోట్లు ఇవ్వగా, ఆ తర్వాతి హెల్త్‌కేర్ విభాగంలో రూ.626 కోట్లు, గ్రామాల అభివృద్ధి కోసం రూ.331 కోట్లు ఇచ్చారు.

భారత్‌లో విరాళం ఇచ్చినవారిలో టాప్-10 జాబితా

పేరు	విరాళం(రూ.కోట్లలో)
శివ్ నాడర్ అండ్ కుటుంబం	2,153
ముకేశ్ అంబానీ అండ్ కుటుంబం	407
బజాజ్ కుటుంబం	352
కుమార మంగళం బిర్లా ఫ్యామిలీ	334
గౌతమ్ అదానీ ఫ్యామిలీ	330
నందన్ నీలేఖని	307
కృష్ణ చివుకుల	228
అనిల్ అగర్వాల్ అండ్ కుటుంబం	181
సుస్మిత అండ్ సుబ్రాటో బాగ్చి	179
రోహిణి నీలేఖని	154

మహిళలకోసం వీ రిచ్

హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబర్ 7 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో ఉన్న మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడానికి వీ హబ్ ఫౌండేషన్ ప్రత్యేకంగా మూడు నెలలపాటు ఇంక్యూబేషన్ ప్రోగ్రామ్ వీ రిచ్‌ను ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ పాల్గొని ప్రారంభించారు. ఆలోచనల స్థాయి నుంచి వ్యాపారం వరకు కావాల్సిన అంశాలపై అవగాహన కల్పించనున్నారు. ఈ వీ రిచ్ కింద ఎంపిక చేసిన 60 మంది మహిళలకు మెంటార్‌షిప్, డిజిటల్, ఆర్థిక అక్షరాస్యత, ప్రాక్టికల్ వర్క్ షాప్స్, ఎక్స్‌పోజర్ విజిట్ వంటి అంశాలపై 3 నెలలపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు వీ హబ్ ఫౌండేషన్ సీఈవో సీత పల్లచొల్ల తెలిపారు.

గోల్డ్ మార్కెట్ క్రాష్



భారీగా తగ్గిన బంగారం ధర • హైదరాబాద్‌లో ఒక్కరోజే రూ.1,790 డౌన్

తులం విలువ రూ.78,560కి పతనం • రూ.2,900 క్షీణించిన కిలో వెండి రేటు

న్యూఢిల్లీ, నవంబర్ 7: రికార్డులతో హోరెత్తిస్తూ వేగంగా పెరుగుతూ పోయిన బంగారం, వెండి ధరలు.. అంతే త్వరగా కిందికి దిగొస్తున్నాయి. గురువారం ఒక్కరోజే తులం పసిడి విలువ హైదరాబాద్ మార్కెట్‌లో రూ.1,790 పడిపోయింది. రూ.80వేల మార్కుకు దిగువన ముగిసింది. ఢిల్లీలో కిలో వెండి రేటు రూ.2,900 పతనమైంది. స్థానిక జ్యుయెల్లర్స్ నుంచి డిమాండ్ మందగించడమే ఈ ధరల క్షీణత వెనుక ఉన్న ప్రధాన కారణమని అఖిల భారత సరఫా అసోసియేషన్ వర్గాలు చెప్తున్నాయి. అయితే అంతర్జాతీయ మార్కెట్‌లో నెలకొన్న పరిణామాలూ దేశీయ మార్కెట్‌ను ప్రభావితం చేస్తున్నాయని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

వారం రోజుల్లో

గత గురువారం ఢిల్లీలో 10 గ్రాముల 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) పుత్తడి ధర మును పెన్నడూ లేనివిధంగా ఆల్‌టైమ్ హైని తాకుతూ రూ. 82,400 పలికింది. అయితే ఈ గురువారం రూ. 79, 500కు పరిమితమైంది. ఈ ఒక్కరోజే రూ.1,650 తగ్గుముఖం పట్టగా, గడిచిన వారం రోజుల్లో రూ.2,900 దిగినట్టైంది. ఇక హైదరాబాద్‌లో 24 క్యారెట్ పసిడి తులం ధర రూ.1,790 పడిపోయి రూ.78,560 వద్ద నిలిచింది. 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత లేదా బంగారు ఆభరణాలు) రూ.1,650 తగ్గి రూ.72,000గా ఉన్నది.

వెండి ధరలు..

బంగారంతోపాటు వెండి ధరలూ వెలవెలబోతున్నాయి. గురువారం ఢిల్లీలో కిలో ధర రూ.2,900 దిగజారి రూ.93,800గా నమోదైంది. ముఖ్యంగా నాణేల తయారీదారులు, పారిశ్రామిక వర్గాల నుంచి ఆదరణ కరువైంది. వారం, పది రోజుల క్రితం గరిష్ఠంగా లక్షా 2,000 రూపాయలు పలికిన వెండి రేటు.. రూ.8వేలకుపైగా తగ్గినట్టైంది. సాధారణ కస్టమర్లు ధరలు ఎక్కువగా ఉండటంతో బంగారం, వెండి కొనుగోళ్లకు దూరంగా ఉంటున్నారని, అందుకే డిమాండ్ పడిపోయిందని వర్తకులు చెప్తున్నారు. కాగా, ధరలు ఇలా పడిపోతున్నా వ్యాపారం సాగదని, ఎక్కడో ఓచోట ధరలు స్థిరంగా ఉంటేనే విక్రయాలు బాగుంటాయని వారు పేర్కొంటున్నారు.

అంతర్జాతీయ మార్కెట్‌లో

గ్లోబల్ మార్కెట్‌లోనూ గోల్డ్, సిల్వర్ రేట్లు నేలచూపుల్నే చూస్తున్నాయి. 1.90 డాలర్లు పడిపోయి ఔన్సు బంగారం ధర 2,674.40 డాలర్లుగా ఉన్నది. వెండి 31.26 డాలర్లు పలికింది. ఇక దేశీయంగా ఫ్యూచర్ మార్కెట్ విషయానికొస్తే.. డిసెంబర్ డెలివరీకిగాను పసిడి కాంట్రాక్టుల విలువ ఎంసీఎక్స్‌లో తులం రూ.76,655గా నమోదైంది. వెండి కిలో రూ.90,811 పలికింది. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ విజయం సాధించడంతో మదుపరులు తమ పెట్టుబడులను బంగారం, వెండి నుంచి తిరిగి ఈక్విటీలు, బాండ్ మార్కెట్ల వైపు మళ్లిస్తున్నారని, అందుకే గోల్డ్, సిల్వర్ మార్కెట్లలో ఈ కరెక్షన్ ఉందని ఎక్స్‌పర్ట్ అభివర్ణిస్తున్నారు. దీంతో ముున్ముందు ధరల్లో మరింత దిద్దుబాటుకు అవకాశాలూ లేకపోలేదని చెప్తున్నారు. ఇక ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల కోతలు సైతం మార్కెట్‌పై ప్రభావం చూపుతున్నట్టు విశ్లేషిస్తున్నారు.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వడ్డీరేట్ల పెంపు

న్యూఢిల్లీ, నవంబర్ 7: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రుణ గ్రహీతలకు షాకిచ్చింది. ఎంపిక చేసిన రుణాలపై మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్-బేస్డ్ లెండింగ్ రేటు(ఎంసీఎల్‌ఆర్)ని 5 బేసిస్ పాయింట్లు పెంచింది. ఏడాది కాలపరిమితితో అత్యధిక మంది తీసుకునే వాహన, వ్యక్తిగత రుణాలపై వడ్డీరేటు 9.45 శాతానికి చేరుకున్నది. అలాగే ఒక్క రోజు రుణాలపై వడ్డీరేటు 9.10 శాతం నుంచి 9.15 శాతానికి చేరుకోగా, నెల రుణాలపై వడ్డీని ఐదు బేసిస్ పాయింట్లు సవరించడంతో రుణ రేటు 9.20 శాతానికి చేరుకున్నది.

లాభాల్లో మహీంద్రా

ముంబై, నవంబర్ 7: దేశీయ ఆటో మొబైల్ దిగ్గజాల్లో ఒకటైన మహీంద్రా అండ్ మహీంద్రా లిమిటెడ్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. సెప్టెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.3,171 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.2,348 కోట్ల కంటే ఇది 35 శాతం అధికమని పేర్కొంది. కంపెనీ కన్సాలిడేటెడ్ ఆదాయం రూ.34,436 కోట్ల నుంచి రూ.37,924 కోట్లకు పెరిగింది.

ఆంధ్రా షుగర్స్ ఆస్పిరిన్ ప్లాంట్ ఓకే

ఎఫ్‌డీఏ తనిఖీల్లో పాస్

హైదరాబాద్, నవంబర్ 7: ఆంధ్రా షుగర్స్ లిమిటెడ్‌కు చెందిన ఆస్పిరిన్ ఉత్పాదక కేంద్రం అమెరికా ఎఫ్‌డీఏ పరిశీలనలో పాసైంది. ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి జిల్లా వెంకటరాయపురంలోగల ఆస్పిరిన్ ఔషధ తయారీ ప్లాంట్‌ను ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఇద్దరు యూఎస్‌ఎఫ్‌డీఏ అధికారులు సందర్శించి తనిఖీలు చేపట్టారు. కాగా, అన్ని నిబంధనలకు లోబడే ఈ ప్లాంట్ నడుస్తున్నట్టు సర్టిఫికెట్ ఇచ్చారని తాజాగా కంపెనీ ఓ ప్రకటనలో పేర్కొన్నది. ఏ రకమైన ఫామ్ 483 అబ్జర్వేషన్లు జారీ చేయలేదని స్పష్టం చేసింది. 1947లో మొదలైన ఈ సంస్థ ప్రస్తుతం చక్కెరతోపాటు ఆర్గానిక్, ఇన్‌ఆర్గానిక్ రసాయనాలు, ఎరువులు, ఆస్పిరిన్, సలిక్లిక్ యాసిడ్, పవర్ తదితర ఉత్పత్తుల్లోకి విస్తరించింది. తణుకు, కొవ్వూరు, గుంటూరు, తాడువాయి, సగ్గొండ, భీమడోలులో ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్‌లు సంస్థకున్నాయి.

రెండింతలైన ఎన్‌సీసీ లాభం

హైదరాబాద్, నవంబర్ 7: ప్రముఖ మౌలిక సదుపాయాల సంస్థ ఎన్‌సీసీ అంచనాలకు మించి రాణించింది. సెప్టెంబర్ త్రైమాసికానికిగాను సంస్థ రూ.163 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది నమోదైన రూ.77 కోట్ల లాభంతో పోలిస్తే రెండు రెట్లు పెరిగినట్లు వెల్లడించింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.5,224.36 కోట్లకు ఎగబాకినట్లు వెల్లడించింది. గత త్రైమాసికంలో కొత్తగా రూ.4,760 కోట్ల విలువైన ఆర్డర్లు రావడంతో మొత్తం ఆర్డర్ బుక్ విలువ రూ.52,370 కోట్లకు చేరుకున్నది.

జెట్ ఎయిర్‌వేస్ కథ కంచికి

న్యూఢిల్లీ, నవంబర్ 7: జెట్ ఎయిర్‌వేస్ దివాలా కథ కీలక మలుపు తిరిగింది. పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయిన ఈ ఎయిర్‌లైన్ ఆస్తుల్ని అమ్మేయాలంటూ గురువారం సుప్రీం కోర్టు ఆదేశించింది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 ద్వారా లభిస్తున్న విశేషాధికారాలను ఉపయోగిస్తూ అత్యున్నత న్యాయస్థానం ఈ తీర్పునిచ్చింది. ఫలితంగా ఈ కేసులో నేషనల్ కంపెనీ లా అప్పీలెట్ ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌ఏటీ) ఆదేశాలను పక్కనపెడుతూ జెట్ ఎయిర్‌వేస్ దివాలా ప్రక్రియకు సుప్రీం ముగింపు పలికినట్టైంది. ఇక ఈ వ్యవహారంలో జెట్ ఎయిర్‌వేస్ అధినేత నరేష్ గోయల్ జైలుపాలైన విషయం తెలిసిందే.

ఇదీ సంగతి..

ఒకప్పుడు దేశీయ అతిపెద్ద ప్రైవేట్‌రంగ విమానయాన సంస్థగా వెలుగొందిన జెట్ ఎయిర్‌వేస్‌ను 2010 చివరి నుంచి ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టాయి. మితిమీరిన రుణ భారం (రూ.7,500 కోట్లు), పెరిగిన నిర్వహణ వ్యయం, ప్రత్యర్థి సంస్థల నుంచి పోటీ తీవ్రతరం నేపథ్యంలో జెట్ విమానయాన కార్యకలాపాలు 2019 ఏప్రిల్‌లో నిలిచిపోయాయి. ఉద్యోగులకు జీతాలివ్వలేక, తెచ్చిన అప్పుల్ని తిరిగి చెల్లించలేక యాజమాన్యం చేతులెత్తేసింది. ఈ క్రమంలోనే బకాయిల వసూళ్లలో భాగంగా ఎస్బీఐ నేతృత్వంలోని రుణదాతలు దివాలా ప్రక్రియ కోసం ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించారు. దీంతో జెట్‌ను టేకోవర్ చేసేందుకు బ్రిటన్‌కు చెందిన కల్రాక్ క్యాపిటల్, యూఏఈకి చెందిన మురారీ లాల్ జలాన్ కన్సార్టియం ముందుకొచ్చింది. ఈ కన్సార్టియం ప్రతిపాదించిన పునరుద్ధరణ ప్రణాళికకు 2021లో ఎన్‌సీఎల్‌టీ ఆమోదం లభించింది. దీని ప్రకారం తొలుత రూ.350 కోట్లు, ఆ తర్వాత రూ.4,783 కోట్లను కన్సార్టియం చెల్లించాలి. అయితే కన్సార్టియం విఫలమైంది. తదనంతరం ఈ వ్యవహారం ఎన్‌సీఎల్‌ఏటీలోకి వెళ్లగా, అక్కడ ఎలాంటి చెల్లింపులు చేయకుండానే జలాన్-కల్రాన్ కన్సార్టియంకు జెట్ ఎయిర్‌వేస్ యాజమాన్య హక్కుల బదిలీకి వీలు కల్పిస్తూ ఆదేశాలు వచ్చాయి. దీన్ని తీవ్రంగా వ్యతిరేకించిన రుణదాతలు సుప్రీం కోర్టు గడప తొక్కాయి. ఈ నేపథ్యంలోనే ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్, న్యాయమూర్తులు జేబీ పర్దివాలా, మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం ఎన్‌సీఎల్‌ఏటీ ఆదేశాలను తోసిపుచ్చుతూ పైవిధంగా తీర్పునిచ్చింది. ఇక జెట్‌ను దక్కించుకునే ప్రక్రియలో భాగంగా కన్సార్టియం చెల్లించిన రూ.200 కోట్లనూ జప్తు చేయాల్సిందిగా సుప్రీం ఆదేశించింది. ఇందులో బ్యాంకులు రూ.150 కోట్లను పర్ఫార్మెన్స్ బ్యాంక్ గ్యారంటీగా అందుకోవచ్చని కూడా చెప్పింది.

తెలుగు రాష్ట్రాలపై టెక్‌బుక్ ఫోకస్

హైదరాబాద్, నవంబర్ 7: దేశంలో అతిపెద్ద స్కూల్ ఎడ్యుటెక్ కంపెనీ లీడ్ గ్రూపు ఇటీవల టెక్‌బుక్ సేవలను ఆరంభించింది. సంప్రదాయ టెక్స్ట్‌బుక్‌లకు ప్రత్యామ్నాయంగా ఈ టెక్‌బుక్ సేవలను ఇటీవల ప్రారంభించింది. ప్రస్తుతం టెక్‌బుక్‌తో తెలంగాణతోపాటు ఏపీల్లో 100కి పైగా స్కూళ్లకు ఈ అత్యాధునిక టెక్నాలతో చదువులకు సంబంధించిన సేవలు అందిస్తుండగా, వీటికి పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని వచ్చే మూడేండ్లలో 500 స్కూళ్లకు పెంచుకోనున్నట్లు లీడ్ గ్రూపు కో-ఫౌండర్, సీఈవో సుమీత్ మెహతా తెలిపారు. విద్యార్థులకు మ్యాథ్స్, సైన్స్, ఇంగ్లీష్ సబ్జెక్ట్‌లపై మరింత పట్టు సాధించడానికి ఈ నూతన టెక్నాలజీ సేవలు ఎంతో ఉపయోగపడుతాయని, ప్రస్తుతం సీబీఎస్‌ఈ బోధిస్తున్న స్కూళ్లకు మాత్రమే ఈ టెక్నాలజీ సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం సంస్థలో 1,200 మంది సిబ్బంది ఉన్నారని, వచ్చే మూడేండ్లలో వీరి సంఖ్యను రెండింతలు పెంచుకోనున్నట్లు ప్రకటించారు.

మహబూబ్‌నగర్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

శ్రీనివాస్‌గౌడ్ కుటుంబంపై కక్ష సాధింపు తగదు

- అధికారం ఎవరికీ శాశ్వతం కాదు: ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి
- పాలమూరు జైలులో ఉన్న శ్రీకాంత్‌గౌడ్‌కు పరామర్శ

మహబూబ్‌నగర్, నవంబర్ 7: పాలమూరును అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుంచిన మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కుటుంబంపై కాంగ్రెస్ నేతలు కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం తగదని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం మహబూబ్‌నగర్ జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న బీఆర్‌ఎస్ నేత శ్రీకాంత్‌గౌడ్‌తో ఆయన ములాఖత్ అయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. 'పాలమూరులో ఇండ్ల విషయంలో శ్రీకాంత్‌గౌడ్ తప్పుడు పత్రాలు సృష్టించారని అంటున్నారు.. కానీ తహసీల్దార్ రిపోర్టులో ఆ విషయం ఉందా? ఎవరో అనామకులు చెప్పారని ఆయనను అరెస్టు చేస్తారా? రేపు ఎవరో సీఎం రేవంత్‌రెడ్డి పేరు చెప్తే వారిని అరెస్టు చేస్తారా?' అని ప్రశ్నించారు. అంధులు, దివ్యాంగుల నుంచి డబ్బులు తీసుకోవాల్సిన పరిస్థితి శ్రీనివాస్‌గౌడ్ కుటుంబానికి లేదని గుర్తుచేశారు. 'పట్టాలిచ్చేది మీరే.. నల్లా, కరెంట్ కనెక్షన్లు ఇచ్చేది అధికారులే.. ఇప్పుడు అక్రమ నిర్మాణాలని కూల్చివేయడం ఎంత వరకు సబబు' అని నిలదీశారు. ఇండ్ల బాధితులను పరామర్శించేందుకు వెళ్లిన శ్రీనివాస్‌గౌడ్‌పై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. అధికార పార్టీ కనుసన్నల్లో పోలీసులు మెలుగుతున్నారని ఆరోపించారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. కక్షపూరితంగా వ్యవహరించే వారి పేర్లను బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డైరీలో నోట్ చేసుకుంటున్నారని హెచ్చరించారు.

ఉక్రెయిన్‌పై 8 గంటలు డ్రోన్ దాడులు

వెయ్యి రోజులకు చేరువలో యుద్ధం

కీవ్ : ఉక్రెయిన్ రాజధాని నగరం కీవ్‌పై రాత్రి వేళ 8 గంటలపాటు రష్యన్ డ్రోన్లు నిర్విరామంగా విరుచుకుపడ్డాయి. వేర్వేరు ఎత్తులు, వేర్వేరు దిశల నుంచి డజన్ల కొద్దీ డ్రోన్లు ఒక్కొక్కటిగా, గుంపులుగా దాడి చేశాయి. ఉక్రెయిన్ అధికారులు గురువారం ఈ వివరాలను వెల్లడించారు. తమ దేశ వైమానిక దళం మూడు డజన్ల డ్రోన్లను ధ్వంసం చేసిందని, వీటి శిథిలాలు పడటంతో ఓ దవాఖాన, కొన్ని ఇండ్లు, కార్యాలయాల భవనాలు దెబ్బతిన్నాయని చెప్పారు. ఓ అపార్ట్‌మెంట్‌లోని 33వ అంతస్తులో మంటలు చెలరేగడంతో ఇద్దరు గాయపడినట్లు తెలిపారు. దాదాపుగా ప్రతిరోజూ కీవ్‌పై డ్రోన్ దాడులు జరుగుతున్నాయని తెలిపింది. రష్యా, ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమై దాదాపు 1,000 రోజులు కావొస్తున్నది.

హైకోర్టు జడ్జిల పింఛనుపై సుప్రీంకోర్టు దిగ్భ్రాంతి

న్యూఢిల్లీ: హైకోర్టు మాజీ న్యాయమూర్తులకు లభిస్తున్న పింఛను పట్ల సుప్రీంకోర్టు గురువారం దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. వీరికి రూ.6,000 నుంచి రూ.15,000 వరకు పింఛను లభిస్తున్నట్లు తెలుసుకుని అవాక్కైంది. పిటిషనర్ తన పిటిషన్‌లో, తాను 13 ఏండ్ల పాటు జిల్లా కోర్టులో జ్యుడిషియల్ ఆఫీసర్‌గా పని చేసినట్లు తెలిపారు. ఆ తర్వాత అలహాబాద్ హైకోర్టు జడ్జిగా పదోన్నతి లభించిందన్నారు. పింఛను కోసం సర్వీసును లెక్కించేటపుడు తన జ్యుడిషియల్ సర్వీసును పరిగణనలోకి తీసుకోవడానికి అధికారులు తిరస్కరించారని చెప్పారు. జస్టిస్ బీఆర్ గవాయ్ స్పందిస్తూ, జడ్జిలకు పదవీ విరమణ తర్వాత హైకోర్టులు, రాష్ట్ర ప్రభుత్వాలు వేర్వేరు విధాలుగా సదుపాయాలు కల్పిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తదుపరి విచారణను ఈ నెల 27కు వాయిదా వేశారు.

హిందీ టీచర్ల తొలగింపు

- అర్హతలేదని ఏడుగురుకి విద్యాశాఖ ఉత్తర్వులు
- 'సర్టిఫికెట్ల పరిశీలన సక్రమమేనా?' అని ముందే చెప్పిన 'నమస్తే తెలంగాణ'
- మా జీవితాలతో విద్యాశాఖ చెలగాటం: తొలగింపు టీచర్లు

ఖమ్మం డీఈవో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న తొలగించిన డీఎస్సీ 2024 ఉపాధ్యాయులు

ఖమ్మం ఎడ్యుకేషన్, నవంబర్ 7: అధికారుల నిర్లక్ష్యం కారణంగా అర్హతలేనివారికి ఉద్యోగాలొచ్చాయి. దీనిని గుర్తించిన అర్హత కలిగిన అభ్యర్థులు పోరాడారు. ఫలితంగా విచారణ జరగడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు డీఎస్సీ 2024లో స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ), హిందీ లాంగ్వేజ్ పండిట్ (ఎల్‌పీ)లలో అర్హత లేదని పేర్కొంటూ ఏడుగురు అభ్యర్థులను ఉద్యోగం నుంచి తొలగిస్తూ ఖమ్మం డీఈవో ఉత్తర్వులు జారీ చేశారు. వీరిస్థానంలో అర్హులైన వారికి,పెండింగ్‌లో ఉన్న స్థానాల్లో ఉన్న వారికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. దీంతో వారు గురువారం విధుల్లో చేరారు.

ఒక్కొక్కటిగా బయటకొస్తున్న తప్పిదాలు

డీఎస్సీ-2024లో హిందీ సబ్జెక్ట్‌లో జరిగిన తప్పిదాలు ఒక్కొక్కటిగా బయటకొస్తున్నాయి. నియామక పత్రం అందజేస్తున్న సమయంలోనే ఒకరిని తొలగించారు. అర్హత లేదని తాజాగా మరో ఏడుగురిని టర్మినేట్ చేశారు. స్కూల్ అసిస్టెంట్ క్యాటగిరీలో ఒకరిని, హిందీ ఎల్‌పీలో ఆరుగురిని తొలగించారు. ఆయా పోస్టుల్లో ఉద్యోగాలు చేసేందుకు అవసరమైన డిగ్రీ,పీజీలో క్వాలిఫికేషన్ లేదని పేర్కొంటూ డీఈవో సోమశేఖరశర్మ టర్మినేషన్ ఉత్తర్వులను అందజేశారు. అక్టోబర్ 2 నుంచి 5 వరకు సర్టిఫికెట్ల పరిశీలన జరగగా.. అక్టోబర్ 15న నియామక పత్రాలు అందజేశారు. వాటితో అక్టోబర్ 16న ఆయా స్కూళ్లలో రిపోర్ట్ చేసిన ఎల్‌పీలను సుమారు 24 రోజుల తర్వాత ఉద్యోగం నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. తొలగించిన వారిలో శ్రీదేవి, నాగేశ్వరరావు, రామలింగయ్య, వెంకటరత్నం, నాగలక్ష్మి, లావణ్య, నాగులుమీరా ఉన్నారు. వారి స్థానాల్లో అర్హులను నియమిస్తూ డీఈవో ఉత్తర్వులివ్వడం, వారు తక్షణమే విధుల్లో చేరడం జరిగిపోయాయి. ఎల్‌పీ హిందీలో ఏడుగురికి, స్కూల్ అసిస్టెంట్‌లో ముగ్గురికి నియామక పత్రాలు అందజేశారు. విధుల్లో చేరిన హిందీ ఎల్‌పీల్లో జేవీ శ్యామ్‌ప్రసాద్, బాజీ, షాహినాబేగం, పద్మ, నాగేశ్వరరావు, ఈశ్వరీబాయి, రామ్‌ప్రసాద్ ఉన్నారు. స్కూల్ అసిస్టెంట్లలో వాజీర్, శిరీష, అర్షద్‌పాషా ఉన్నారు. ఈ పదిమంది గురువారమే ఆయా హెచ్‌ఎంలకు రిపోర్టు చేసి విధుల్లో చేరారు. కాగా..డీఎస్సీ 2024లో కొందరికి అర్హత లేకపోయినా ఉద్యోగాలు పొందేందుకు కారణమైన ప్రధానోపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని వరంగల్ ఆర్జేడీకి డీఈవో వివరాలు సమర్పించారు. అర్హతలేని టీచర్లను తొలగించి.. అర్హులైన వారికి నియామకపత్రాలు అందించిన ప్రక్రియను విద్యాశాఖ అధికారులు గోప్యంగా నిర్వహించారు. నూతన టీచర్లు గురువారం ఉదయమే విధుల్లో చేరేలా ఆయా పాఠశాలల హెచ్‌ఎంలను అప్రమత్తం చేశారు. తొలగించిన టీచర్లు కోర్టును ఆశ్రయించకుండా ఈ ప్రక్రియను అత్యంత గోప్యంగా చేపట్టారు.

ముందే చెప్పిన 'నమస్తే తెలంగాణ'

డీఎస్సీ-2024 సర్టిఫికెట్ల పరిశీలన మొదలైనప్పటి నుంచి నియామకపత్రాలు అందించే వరకూ జరిగిన ప్రక్రియలో పలు తప్పిదాలు ఉన్నాయని 'నమస్తే తెలంగాణ' ముందే చెప్పింది. 'సర్టిఫికెట్ల పరిశీలన సక్రమమేనా?' అనే శీర్షికన అక్టోబర్ 22న ప్రధాన కథనాన్ని ప్రచురించింది. కలెక్టర్‌తోపాటు త్రీమెన్ కమిటీ విద్యాశాఖ అధికారులు స్పందించారు. హిందీకి సంబంధించిన సర్టిఫికెట్ల పరిశీలనను మరోసారి క్షుణ్ణంగా నిర్వహించారు.

మంచిర్యాలలోని ఎంసీహెచ్ పరిసరాలను శుభ్రం చేస్తున్న మద్యంప్రియులు

ఎంసీహెచ్‌ను శుభ్రం చేయండి

మద్యంప్రియులకు మొదటి అడిషనల్ సివిల్ జడ్జి వినూత్న తీర్పు

మంచిర్యాల అర్బన్, నవంబర్ 7: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన మద్యంప్రియులకు మంచిర్యాల జిల్లా కోర్టు వినూత్న తీర్పునిచ్చింది. వారంపాటు పట్టణంలోని మాతా శిశు సంరక్షణ కేంద్రంలో పారిశుధ్య పనులు చేయాలని ఆదేశించింది. ఇటీవల మంచిర్యాలలో ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీ నిర్వహించగా.. 27 మంది మద్యంప్రియులు పట్టుబడ్డారు. వీరిని బుధవారం కోర్టులో హాజరుపరచగా, మొదటి అడిషనల్ సివిల్ జడ్జి ఉపనిషద్విని వినూత్న తీర్పునిచ్చారు. వారంపాటు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎంసీహెచ్ పరిసరాలను పరిశుభ్రం చేయాలని తీర్పునిచ్చారు. ఈ మేరకు గురువారం మంచిర్యాల ట్రాఫిక్ ఏఎస్సై జీ నందయ్య మద్యంప్రియులను తీసుకొచ్చి ఎంసీహెచ్ పరిసరాలను శుభ్రం చేయించారు. ఎవరైనా గైర్హాజరైతే తిరిగి వారంపాటు పనులు చేయించనున్నారు.

ఈడీ విచారణకు ఆర్డీవో వెంకటాచారి

హైదరాబాద్, నవంబర్ 7 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా నాగారంలో 42 ఎకరాల భూదాన్ భూముల అన్యాక్రాంతం కేసులో అప్పటి ఆర్డీవో వెంకటాచారిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ గురువారం విచారించింది. ఇటీవల ఐఏఎస్ అమోయ్‌కుమార్, తహసీల్దార్ జ్యోతి ఇచ్చిన సమాచారంతో ఆర్డీవో వెంకటాచారిని విచారించారు. భూదాన్ బోర్డుకు చెందిన 50 ఎకరాల భూమిని ఖాదురున్నీసాకు అధికారులు రిజిస్ట్రేషన్ చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో జరిగిన ఆర్థిక లావాదేవీలపై ఆర్డీవోను ఈడీ ప్రశ్నించింది.

విద్యార్థికి కరెంట్ షాక్

తీవ్రగాయాలు.. రిమ్స్‌కు తరలింపు

ఇంద్రవెల్లి, నవంబర్ 7: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని జడ్పీ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న మసురే వీరేందర్ విద్యుత్తు షాక్‌కు గురయ్యాడు. గురువారం పూలాజీ బాబానగర్‌లోగల గ్రౌండ్‌లో ఆడుకుంటుండగా.. నిర్మాణంలో ఉన్న నూతన భవనంపై వేలాడుతున్న 11 కేవీ విద్యుత్తు వైర్లను పట్టుకోవడంతో షాక్‌కు గురయ్యాడు. తోటి విద్యార్థులు కర్రలతో కొట్టి వైర్ల నుంచి విద్యార్థిని వేరు చేశారు. తీవ్రగాయాలైన వీరేందర్‌కు ప్రభుత్వ దవాఖానలో ప్రథమ చికిత్స అందించి 108 అంబులెన్స్‌లో రిమ్స్‌కు తరలించారు.

షారుఖ్ ఖాన్‌కు బెదిరింపులు

50 లక్షలు ఇవ్వకపోతే చంపేస్తామని ఫోన్ కాల్

ముంబై, నవంబర్ 7: బాలీవుడ్ సూపర్‌స్టార్ షారుఖ్ ఖాన్‌ను చంపేస్తామని గుర్తు తెలియని వ్యక్తి ఏకంగా పోలీస్ స్టేషన్‌కు ఫోన్ చేసి బెదిరించారు. గురువారం ముంబైలోని బాంద్రా పోలీస్ స్టేషన్‌కు ఓ వ్యక్తి ఫోన్ చేసి.. షారుఖ్ ఖాన్ తమకు రూ.50 లక్షలు ఇవ్వకపోతే ఆయనను చంపేస్తామని హెచ్చరించాడు. బెదిరింపులకు పాల్పడ్డ వ్యక్తి ఫోన్ నెంబరు ఆధారంగా పోలీసులు కూపీ లాగగా ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌కు చెందిన ఫైజన్ ఖాన్ అనే అడ్వకేట్ పేరు మీద ఆ నెంబరు రిజిస్టరై ఉన్నట్టు గుర్తించారు. రాయ్‌పూర్‌కు వెళ్లి ఫైజన్ ఖాన్‌ను విచారించగా.. తన ఫోన్ కొన్ని రోజుల క్రితమే పోయిందని, బెదిరింపు కాల్‌తో తనకు సంబంధం లేదని చెప్పారు. తనను బెదిరింపు కేసులో ఇరికించేందుకు ఎవరో ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కాగా, 1994లో విడుదలైన అంజామ్ సినిమాలో జింకలపై షారుఖ్ ఖాన్ డైలాగ్‌పై తాను ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేశానని ఆయన చెప్పారు.

ఆస్తిపన్ను ఆదాయం పెంచాలి

మున్సిపల్ కమిషనర్లకు సీడీఎంఏ డైరెక్టర్ ఆదేశం

హైదరాబాద్, నవంబర్ 7 (నమస్తే తెలంగాణ) : ట్రిపుల్‌ఆర్, ఓఆర్‌ఆర్ పరిధిలోని మున్సిపాలిటీల్లో ఆస్తి పన్ను ఆదాయం పెంచాలని, ఈ నెలాఖరు వరకు గరిష్ఠంగా వసూళ్లు చేయాలని సీడీఎంఏ డైరెక్టర్ శ్రీదేవి ఆయా మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. గురువారం ట్రిపుల్ ఆర్ పరిధిలోని 15 మున్సిపాలిటీల కమిషనర్లతో డైరెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆయా మున్సిపాలిటీల పరిధిలోని కాలనీలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

SUPER HIT... నేడే చూడండి

శాంతి 70 ఎంఎం ఏ/సి - నారాయణగూడ 2.00,9.00PM

PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట 10.20AM	INOX జి.ఎస్.ఎమ్ - మదీనాగూడ 1.45PM
PVR ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్ 4.55 PM	INOX ఎం.పి.మాల్ - కాచిగూడ 5.00 PM
PVR ఫోరంమాల్ - కూకట్‌పల్లి 2.25PM	INOX సత్వనెక్లెస్ మాల్స్ - కవాడిగూడ 1.25PM
PVR గలేరియా - పంజాగుట్ట 1.15 PM	INOX అశోక ఏ/సి - వై.జంక్షన్ 1.50 PM
PVR పివిఆర్ - ఎర్రమంజిల్ 4.40 PM	AMR ఎఎంఆర్ - మౌలాలి 7.20PM
PVR పివిఆర్ - మూసారంబాగ్ 4.50 PM	MOVIETIME ప్లాటినమ్ - అమీర్‌పేట్ 1.45PM
PVR ప్రెస్టేన్ ప్రైమ్ - గచ్చిబౌలి 1.15PM	MOVIETIME ప్రైమ్‌మాల్ - సనత్‌నగర్ 10.30AM
PVR ఐకాన్ - హైటెక్ సిటీ 4.40PM	ఎం.జె.ఆర్ - నారపల్లి 1.45PM
PVR ATRIUM మాల్ -గచ్చిబౌలి 1.45PM	సినీప్లానెట్ ఏ/సి - కొంపల్లి 10.25PM
Cinépolis లులు మాల్ - కూకట్‌పల్లి 1.10PM	లక్ష్మీకళ - మూసాపేట్ 11.30AM
Cinépolis CCPL - మల్కాజ్‌గిరి 5.10PM	మిరాజ్ సినిమాస్ - దిల్‌సుఖ్‌నగర్ 5.10PM
Cinépolis డి.ఎల్.ఎఫ్ - ఉప్పల్ 3.05PM	మిరాజ్ సినిమాస్ - ఐడిపిఎల్ 5.10PM
Cinépolis మంత్రామాల్ - అత్తాపూర్ 10.40PM	మిరాజ్ సినిమాస్ - చందానగర్ 2.00PM
Cinépolis సుధ - శాలిబండ 5.10PM	సినీమార్ట్ - ఆర్.సి.పురం 10.30,1.35PM
AMB ఎఎంబి - గచ్చిబౌలి 1.15 PM	GPR జిపిఆర్ - కూకట్‌పల్లి 1.30PM
ఎఎఎ ఏ/సి - అమీర్‌పేట్ 4.25PM	JP జెపి ఏ/సి - చందానగర్ 10.30,4.35PM
అపర్ణ సినిమాస్ - నల్లగండ్ల 10.25AM	
INOX ఐనాక్స్ - బంజారాహిల్స్ 1.50 PM	GLOBAL CINEMAS RELEASE